క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

రెబ్బెన: మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కార్నాథం చంద్రయ్య మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఆసిఫాబాద్ పీఏసీఎస్ చైర్మన్ అలిబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద చౌక్‌లో వైన్‌షాపు వద్దు'

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయవద్దని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైన్‌షాపు ఏర్పాటు చేయడంతో చిరువ్యాపారులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కూడలి వద్ద వైన్ షాపు ఏర్పాటు చేస్తే హైకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

ఉద్యోగాలు పొందిన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న ఆరెకుల ఉద్యోగుల సంఘం నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి, బొంబాయిగూడ గ్రామాలకు చెందిన యువకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కాగా ఆదివారం ఆరెకుల ఉద్యోగుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఆరెకుల ఉద్యోగుల సంఘం నాయకులు అంజన్న, వెంకటేష్, శేఖర్, గణేశ్, కొండయ్య, రాజన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన పునర్విముక్తి దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన పునర్విముక్తి దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బహుజన పునర్విముక్తి ప్రతిజ్ఞ దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిడాం గణపతి జాతీయ జెండా ఆవిష్కరించారు. నాయకులు నక్క మనోహర్, నరేష్, అరుణ్, శ్రీనివాస్, పోషం, సల్మాన్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ తొలగించాలి



విగ్రహానికి అడ్డంగా కట్టిన ఫ్లెక్సీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సతీశ్ కుమార్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో అంబేద్కర్ విగ్రహం కనబడటం లేదన్నారు.

పోషణ మాసానికి బ్రేక్

- సమ్మెలో అంగన్‌వాడీలు
- తెరుచుకోని కేంద్రాలు
- అందని పౌష్టికాహారం



తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలనే సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఏటా సెప్టెంబర్‌లో పోషణ మాసం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా అధికారులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, ప్రీస్కూల్ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి సలహాలు, పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం నిర్వహించాల్సి ఉండగా అంగన్‌వాడీల సమ్మెతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడటంతో పోషణ మాసానికి బ్రేక్ పడింది.

పెంచికల్‌పేట్ మండలంలో..

మండలంలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 22, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 2 ఉన్నాయి. వీటిలో 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 366, 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలు 418, గర్భిణులు 84, బాలింతలు 72 మంది ఉన్నారు. వీరికి ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒక పూట భోజనం, ఉడికించిన గుడ్డు, 200 మి.లీ. పాలు పంపిణీ చేస్తున్నారు. వీరికి ప్రతిరోజు ఆయా కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందజేస్తున్నారు.

సమ్మెతో నిలిచిన పంపిణీ

ప్రతిరోజు ఆయా కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పాలు, గుడ్డు, భోజనం, బాలామృతం అందించాల్సి ఉండగా అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెతో కేంద్రాలు తెరుచుకోవడం లేదు. దీంతో ఆయా కేంద్రాల ద్వారా పోషకాహారం పంపిణీ నిలిచిపోయింది. అధికారులు ప్రత్యామ్నాయంగా కేంద్రాల్లో ఉన్న పోషకాహారాన్ని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు అందచేసినా సక్రమంగా పోషకాహారం లబ్ధిదారులకు అందడం లేదు.

నిలిచిన పోషణమాసం

ఐసీడీఎస్ ద్వారా ఏటా నిర్వహించే పోషణ మాసం కార్యక్రమానికి అంగన్‌వాడీల సమ్మె ఆటంకంగా మారింది. నిత్యం గ్రామాలను సందర్శించి కేంద్రాలకు మహిళలను తీసుకొచ్చే అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో పోషణ మాసం ముందుకు సాగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు తాళం వేసి ఉండటంతో కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో పకడ్బందీగా నిర్వహించే పోషణమాసం సమ్మెతో నిలిచిపోయింది. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి కార్యక్రమం నిర్వహించాలని మండల వాసులు కోరుతున్నారు.

> **ప్రభుత్వ పాఠశాలల ద్వారా పంపిణీ చేస్తున్నాం**
>
> అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు అటాచ్ చేశాం. ప్రతిరోజు ప్రీస్కూల్ పిల్ల లకు పౌష్టికాహారం అందిస్తున్నాం. పోషణ మాసంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా సమ్మెతో నిలిచిపోయాయి.
>
> – హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బీటీరోడ్డు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: బీటీ రోడ్డు మంజూరు చేయాలని కొద్దుగూడ గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లింగు మాట్లాడుతూ కొద్దుగూడ గ్రామానికి రోడ్డులేక ఇబ్బందులు పడుతున్నామని, బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడిన ఎమ్మెల్యే త్వరలోనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరవుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, గ్రామస్తులు జంగు, లింగు, భీంరావు తదితరులు ఉన్నారు.

'ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం'



మాట్లాడుతున్న గొడిసెల కార్తిక్

వాంకిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తిక్ అన్నారు. ఆదివారం వాంకిడిలో నిర్వహించిన డీవైఎఫ్ఐ మండలస్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డీవైఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా దుర్గం నిఖిల్, జాడి తిరుపతి, కిరణ్‌లను, కార్యదర్శులుగా శ్రీకాంత్, సునీల్, వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, భీంరావు, తదితరులను ఎన్నుకున్నారు.

మున్సిపల్ కమిషనర్ పేరుతో బెదిరింపులు

ఆసిఫాబాద్: దుకాణాల లైసెన్సు ఫీజు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పేరుతో జిల్లా కేంద్రంలోని కొంత మంది వ్యాపారులకు ఫోన్ చేసి బెదిరించిన సంఘటన కలకలం సృష్టిస్తోంది. ఇటీవల వ్యాపారాలకు లైసెన్సు తీసుకోవాలని అందుకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాలని కొంతమంది వ్యాపారులను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించడంతో వారు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించారు. మున్సిపల్ కమిషనర్ పేరుతో బెదిరించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ ప్రమోద్ కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



బెజ్జూర్: హోమం నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జూర్: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో గల శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వేడుకలు జ రిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వి శ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం విశ్వకర్మ స్వామికి ప్రత్యేక పూజలతో పాటు హోమ కా ర్యక్రమం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ, అ న్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పురుషోత్తం, బ్రహ్మయ్య, శంకర్, వెంకటయ్య, రాంమోహన్, షణ్ముఖ, పుసాల బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని స్వర్ణకారులు ఘనంగా జరుపుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడు శ్రీకాంత్, స్వామి, తిరుపతి, విశ్వనాథ్, బాలు, ప్రకాశ్, శ్రీనివాస్, ప్రేంసాగర్ తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటిలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అర్చన పూజలు చేశారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం జెండా ఆవిష్కరించారు. బెల్లంపల్లి ఏరియా మాజీ జనరల్ మేనేజర్ జనగామ నాగయ్య, రజనీ దంపతులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణాచారి, ప్రధాన కార్యదర్శి సదాశివ్, నాయకులు యాదగిరి, రామయ్య, జనార్దన్, శంకరయ్య, మొండయ్య, సత్తయ్య, వెంకటేశం, రమేశ్, శ్రీనివాస్, నరసింహ, కిషన్, అశోక్, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు



నవేగాంలో ర్యాలీ తీస్తున్న అధికారులు



కెరమెరిలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రమదానం నిర్వహించినట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. అక్టోబర్ 2 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. శ్రమదానంలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పిచ్చి మొక్కలు తొలగించడంతోపాటు రోడ్లు శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని కొండపెల్లి, నవేగాం గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఖైరిగాం ఎంపీటీసీ రఘుపతి, సర్పంచులు శాంత, మాధవి, ఎంపీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

ఘనంగా సమైక్యతా దినోత్సవం



కాగజ్‌నగర్‌టౌన్: జాతీయ గీతం ఆలపిస్తున్న కోనేరు కృష్ణారావు, నాయకులు



జైనూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కనక యాదవరావు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. తెలంగాణ పోరాటంలో అమరులైన అమరవీరులకు నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

జైనూర్: జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు ఆదివారం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, జైనూర్ సర్పంచ్ పార్వతీలక్ష్మణ్, నాయకులు డోంగ్రే ప్రకాశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

విమోచన దినోత్సవం..



దహెగాం: జాతీయ జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ప్రధాని నరేంద్రమోడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, దామోదర్, తుమ్మిడె సురేశ్, పడాల సురేశ్, మల్లేష్, ప్రదీప్, రాజు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు కోసం విమోచన దినోత్సవాన్ని సమైక్యత దినోత్సవంగా నిర్వహిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిక్షపతి, సింగిల్ విండో డైరెక్టర్ బాబు, రాజారాం, రామయ్య, రాకేశ్, శ్యాంసుందర్, శ్రీనివాస్, మహేశ్, సుధాకర్, ఇస్తారి, సంతోష్, రమేశ్, బాపు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ప్రాంతంలో గల బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండ రాంప్రసాద్, పెంచికల్‌పేట్ అధ్యక్షుడు దేవాజీ, ఆశన్న, బాబాజీ, యాదవ్, బీజేపీ నాయకులు నగేష్, మధుకర్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మండల బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఆవిష్కరించడంతో పాటు బీఎస్పీ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్, మండల అధ్యక్షుడు రవి, రవీందర్ యాదవ్, లలిత, ప్రభాకర్, మారుతి, శ్రుతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో బీఎస్పీ పార్టీ కార్యాలయం ఎదుట ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు రాంటెంకి నవీన్ జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ నాయకులు ఆనంద్, సంజు, రాహుల్, అశోక్, సాజన్, తదితరులు పాల్గొన్నారు.

'మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి'



రెబ్బెన: మాట్లాడుతున్న సీఐ అల్లం నరేందర్



వాంకిడి: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: వినాయకుడి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 9రోజుల పాటు నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద పగలు, రాత్రి ఓ వ్యక్తిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

సిర్పూర్(టి): మండల వాసులు గణేశ్ చతుర్థి, మిలాదున్ నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులు, ముస్లిం మైనార్టీ పెద్దలతో ప్రత్యేకంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సై దీకొండ రమేశ్, గణేశ్ మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కౌటాల: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే కంట్రోల్‌రూం నంబర్ 8712670557, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించే వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా చేసే ఏర్పాట్లపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రెబ్బెన సీఐ అల్లం నరేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు



కెరమెరి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ ఉద్యోగుల తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన నిరవధిక దీక్షలు ఆదివారం 7వ రోజుకు చేరుకున్నాయి. ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ఠకూర్ వనిత, అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత పాల్గొన్నారు.

కెరమెరి: అంగన్‌వాడీల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఆదివారం చెవిలో పూలు పెట్టుకొని వారు నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు స్రవంతి, అనసూయ, గుణసుందరి, మంజూల, సావిత్ర, రాధా, చంద్రకళ, సరోజ, లూర్దమేరి, అమలేశ్వరి, తాయిబాయి, హెల్పర్లు రజిత, సుమిత్ర, రేణుక, జనాబాయి, బూదేవి ఉన్నారు.

కౌటాల: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం 7వ రోజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెకు బీఎస్పీ పార్టీ మండల నాయకులు మద్దతు తెలిపారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, నాయకులు నవీన్, సంజు, జనార్దన్, వినీత, రంజిత, సంపత్, అశోక్, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మెకు సంఘీభావం తెలిపారు. నాయకులు భీమయ్య, శంకర్ గౌడ్, నగేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు కౌటాలలో ధర్నా

కౌటాల: కౌటాల తుమ్మిడిహెట్టి ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో కౌటాలలో ధర్నా చేపడుతున్నట్లు పార్టీ జిల్లా కోశాధికారి రాంటెంకి నవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మొగడ్‌దగడ్ చౌరస్తాలో ధర్నా ఉంటుందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని జన్మదిన వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రధాని నరేంద్ర మోడి జన్మదిన వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

నేడు మౌనదీక్ష

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం మౌనదీక్ష చేస్తున్నట్లు మొగడ్‌దగడ్ సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఉంటుందని, లోఓల్టేజీ సమస్య ఉందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి ఉదయం 10 గంటలకు మౌన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జల్సా కార్యక్రమం విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: మిలాద్ ఉన్ నబి పండుగ పురస్కరించుకొని ఈ నెల 23న నిర్వహించే జల్సా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జల్సా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిసార్, అహ్మద్, సలీం బేగం, సాజిద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

రెబ్బెన: హైదరాబాద్‌లోని వాసవి కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణిని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన ఎం.అమృత అనే మహిళకు ఆదివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో బాధిత మహిళకు రూ.60 వేల చెక్కు మంజూరైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.